ఎల్కతుర్తి : వల్భాపూర్‌లో పథకాల కోసం అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

పరకాల : అధికారులను నిలదీస్తున్న మహిళలు

ఐనవోలు: గర్మిళ్లపల్లి గ్రామసభలో జీపీ కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తురాలు

అనర్హులకే పథకాలు

- లబ్ధిదారుల లిస్టుల్లో నిరుపేదల పేర్లు గల్లంతు
- గ్రామసభల్లో పెల్లుబికిన జనాగ్రహం
- ఎక్కడికక్కడ అధికారుల నిలదీత
- నమ్మించి నట్టేట ముంచిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

శాయంపేట : గ్రామసభలో పోలీసు బందోబస్తు

న్యూశాయంపేట : దరఖాస్తు తీసుకుంటున్న కార్పొరేటర్ మామిండ్ల రాజు

దామెర : పులుకుర్తి గ్రామ సభకు హాజరైన ప్రజలు

'అనర్హులకే పథకాలు ఇస్తున్నారు. లిస్టుల్లో నిరుపేదల పేర్లు గల్లంతయ్యాయి.' అని గ్రామసభల్లో జనాగ్రహం పెల్లుబికింది. ఎక్కడికక్కడ అధికారులను నిలదీశారు. నమ్మించి నట్టేట ముంచిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరకాల, జనవరి 24 : సంక్షేమ పథకాల్లో అర్హులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న వార్డు సభల్లో ప్రజలు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. శుక్రవారం పరకాలలోని 9,10,11,21వ వార్డుల సభలు మాదారం కాలనీలలో నిర్వహించగా, సభలో గందరగోళం నెలకొంది. సభలో సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాను చదువగా అందులో తమ పేరు ఎందుకు లేవని పలువురు అధికారులతో వాదనకు దిగారు. తామెందుకు అర్హులం కాదని మున్సిపల్ కమిషనర్ సుష్మను నిలదీశారు. ఓరుగంటి రమ అనే మహిళ తనకు ఇల్లు రాకుంటే ఆత్మహత్యే శరణ్యమని సభలోనే కన్నీటి పర్యంతమైంది. దీంతో వార్డు సభలో గందరగోళం నెలకొంది.

ఎల్కతుర్తి : గ్రామసభల్లో ప్రజలు సంక్షేమ పథకాల జాబితాపై అధికారులను నిలదీశారు. మండలంలోని బావుపేట, దామెర, వల్భాపూర్, ఎల్కతుర్తి గ్రామాల్లో సభలు నిర్వహించారు. దామెర, వల్భాపూర్, ఎల్కతుర్తిలో ఇండ్లు ఉన్న వారి పేర్లు వచ్చాయని, ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎల్కతుర్తిలో ఆత్మీయ భరోసాలో భూములున్న వారిని కూడా ఎంపిక చేశారని మండిపడ్డారు. రేషన్ కార్డుల్లో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను ప్రశ్నించారు.ఎల్కతుర్తి గ్రామసభకు అధికారులు ఆలస్యంగా వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏవో రాజ్‌కుమార్, పశు వైద్యాధికారి దీపిక పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా అందరికి ఇవ్వాలి..

శాయంపేట : ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఉన్న నిబంధనలు ఎత్తివేసి ఉపాధి హామీ పని చేసిన ప్రతి ఒక్కరికీ రూ.12వేలు ఇవ్వాలని బీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారెపల్లి క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకుడు మారెపల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రసాభాసగా సభలు..

ఐనవోలు : మండల వ్యాప్తంగా గ్రామ సభలు రసాభాసగా జరిగాయి. గర్మిళ్లపల్లి, ఉడుతగూడెం, లింగమోరిగూడెం, రాంనగర్, నందనం, రెడ్డిపాలెం గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న లిస్టులను ఎందుకు చదివి వినిపిస్తున్నారని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. గర్మిళ్లపల్లి, నందనం గ్రామాల్లో అధికారులను ప్రజలు సమస్యలపై నిలదీస్తుంటే కాంగ్రెస్ నాయకులు కల్పించుకోవడంతో వాగ్వాదం జరిగింది. పోలీసులు కల్పించుకోవడంతో గొడవ సద్దుమణిగింది. కాగా, మండల వ్యాప్తంగా గ్రామ సభలు ముగిశాయి. రెడ్డిపాలెం జరిగిన గ్రామ సభలకు ఆర్డీవో రథోడ్ రమేశ్ హాజరైన అనంతరం ఏవో కార్యాలయంలో రైతు భరోసా పోర్టల్ పనితీరుపై ఆరా తీశారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో సునీల్ కుమార్‌రెడ్డి, డీటీ అనిల్‌కుమార్, ఆర్ఐలు మల్లయ్య, రాణి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

న్యూశాయంపేట : అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. న్యూశాయంపేటలోని సుభాష్ విగ్రహం ఆవరణలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజిని, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఆర్ఐ కృష్ణ, వార్డ్ ఆఫీసర్ లోకానందంతో కలిసి వార్డు సభ నిర్వహించారు. పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజా పాలన, సమగ్ర సర్వేలో అందిన దరఖాస్తుల లిస్టును ప్రదర్శించారు. శుక్రవారం కొత్తగా 795మంది రేషన్ కార్డులు, 444మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఇవ్వని వారు కాజీపేట తహసీల్దార్ ఆఫీస్‌లో లేదా కాజీపేట మున్సిపల్ సర్కిల్ ఆఫీసు, డివిజన్ ఆఫీసులో అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఫణి పాల్గొన్నారు.

ఆత్మకూరు : అర్హులకు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపురం, మల్కంపేట, పెంచికలపేట, తిరుమలగిరిలో గ్రామ సభలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో విమల, ఎంఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దామెర : మండలంలోని పులుకుర్తి, సీతారాంపురం గ్రామాల్లో సభలు జరిగాయి. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బాలరాజు, ఎంఈవో రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, ఏవో రాకేశ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్, ఏఈవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అర్షం శ్రీనివాస్, టీపీ సురేందర్, మాజీ సర్పంచ్ వెంకన్న పాల్గొన్నారు.

హనుమకొండ : వరంగల్ పశ్చిమలోని రెవెన్యూ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వార్డు సభ నిర్వహించారు. కార్పొరేటర్ నెక్కొండ కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ప్రజలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని వినతులు అందజేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నామని, అయినా మళ్లీ దరఖాస్తు చేయాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగిసిన గ్రామ సభలు..

శాయంపేట : ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న నాలుగు పథకాలపై నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. శాయంపేట, కొప్పుల, పత్తిపాక, గోవిందాపూర్ గ్రామాల్లో సభలు నిర్వహించారు. పత్తిపాకలో అర్హుల పేర్లు జాబితాలో లేవని స్థానికులు అధికాల దృష్టికి తీసుకెళ్లారు. శాయంపేట గ్రామ సభలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా జాబితాను కార్యదర్శి రత్నాకర్ చదివి వినిపించారు. పరకాల ఆర్డీవో వెళ్లిపోతుండగా ఉండాలని స్థానికులు ఆపివేశారు. అయితే తాము దరఖాస్తులు పెట్టుకున్నా పేర్లు రాలేదని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పేర్లు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు.

66 డివిజన్లలో 42,641 దరఖాస్తులు..

వరంగల్ : గ్రేటర్ కార్పొరేషన్‌లో వార్డు సభలు ముగిశాయి. నాలుగు రోజులుగా 66 డివిజన్లలో అధికారులు వార్డు సభలను నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే వార్డు సభల్లో ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 42,641 మంది దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ వార్డు సభల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రేషన్ కార్డుల కోసం 27,977, ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,662 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 57,477 దరఖాస్తులు..

హనుమకొండ : జిల్లాలో నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామ సభలు ముగిశాయి. జిల్లాలోని 210 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన గ్రామ సభల ద్వారా ప్రజలు వివిధ రకాల పథకాలకు సంబంధించి మొత్తం 57,477 దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో రేషన్ కార్డులకు సంబంధించి 32,987, ఇందిరమ్మ ఇళ్లకు 19,585, రైతు భరోసాకు 388, ఆత్మీ భరోసాకు సంబంధించి 4,517 దరఖాస్తులు ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జనవరి 22 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీస్ స్టేషన్, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఆస్పత్రి, షాపూర్ జీ కాంప్లెక్స్, సోమిడి రోడ్డు, విష్ణుపురి, రహమత్‌నగర్, జూబ్లీమార్కెట్, వెంకటాద్రినగర్, సోమిడి, కాజీపేట మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్‌రోడ్డు, డీ మార్ట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

మడికొండ, జనవరి 24 : మడికొండలో ఇటీవల జరిగిన దొంగతనంపై బాధితురాలు మడికొండ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథన ప్రకారం.. ఈ నెల 18న మడికొండ వేణుగోపాలస్వామి గుడి సమీపంలో ఉండే పొట్లబత్తిని వెంకటమ్మ కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా, రూ.1.36లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్‌పై కాంగ్రెస్ నాయకుడు దాడికి యత్నం

అడ్డుకున్న ఇరు పార్టీల నాయకులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 24 : మా కాంగ్రెస్ పార్టే అధికారంలో ఉంది.. మా ఫ్లెక్సీలే ఉంటాయి.. డివిజన్లలో వేరెవరూ పెట్టొద్దు అని ఆ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్పొరేటర్‌పై ఫైరయ్యారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ తొలగించడంతో ఎవడ్రా నా ఫ్లెక్సీ తీసిందంటూ చిందులు వేశాడు. ఒకదశలో కోపోద్రిక్తుడైన కాంగ్రెస్ 4వ డివిజన్ అధ్యక్షుడు బాషబోయిన శ్రీధర్‌యాదవ్ ఆ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్‌పై దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించగా, ఇరు పార్టీ నాయకులు, స్థానికులు అడ్డుకున్నారు. 4వ డివిజన్ యాదవనగర్ గొల్లపల్లి వద్ద కాంగ్రెస్ 4వ డివిజన్ ప్రెసిడెంట్ బాషబోయిన శ్రీధర్ సంక్రాంతి పండుగ సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా శుక్రవారం కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్ బర్త్‌డే సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని తొలగించి మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ తొలగించిన విషయం తెలుసుకున్న శ్రీధర్‌యాదవ్ అక్కడికి చేరుకుని గొడవకు దిగాడు. సంక్రాంతి పండుగ అయిపోయింది కాదా ఇంకా ఫ్లెక్సీ ఎందుకని అక్కడే ఉన్న కార్పొరేటర్ అశోక్‌యాదవ్ సమాధానం చెప్పడంతో మా కాంగ్రెస్ పార్టీదే అధికారం.. మా ఫ్లెక్సీలు ఉంటాయంటూ దూర్భాషలాడుతూ కార్పొరేటర్‌పై దాడి చేసేందుకు వెళ్లే క్రమంలో అక్కడున్న వారు అడ్డుకున్నారు. దాడిచేసేలా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నాడని కార్పొరేటర్ అశోక్‌యాదవ్ వాపోయారు.

క్రీడాభివృద్ధికి చర్యలు : కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జనవరి 24 : జిల్లాలో క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, వివిధ క్రీడా సంఘాల నాయకులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా నిర్మిస్తున్న రెజ్లింగ్, కబడ్డీ హాల్ పనులపై చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జేఎన్ఎస్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్ కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వరద రాజేశ్వరరావు, సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందాలి'

హనుమకొండ చౌరస్తా, జనవరి 24 : ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందించాలనివరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు అనితారెడ్డి అన్నారు. ప్రపంచ విద్య, బాలిక దినోత్సవం సందర్భంగా హనుమకొండ లష్కర్‌బజార్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలోని రీచ్ బాలికల ఆశ్రమంలో పిల్లలకు నోట్‌బుక్స్, బియ్యం, చాక్లెట్లు అందించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ పరికి సుధాకర్, ఆశ్రమ డైరెక్టర్ జాన్సన్ ప్రసాద్, ఇన్‌చార్జ్ జన్ను నివేదిత పాల్గొన్నారు.

రైతులకు కొత్త పంట రుణాలు ఇవ్వాలి

ఆత్మకూరు, జనవరి 24 : రైతులకు కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆత్మకూరు డీసీసీబీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బంగారం రుణాలు, లోన్ రికవరీపై దృష్టి సారించాలన్నారు.

బీఆర్ఎస్ కొప్పుల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

శాయంపేట, జనవరి 24 : మండలంలోని కొప్పుల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికను శుక్రవారం నిర్వహించినట్లు మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా మేకల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా మామిడి శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మాజీ వైస్ ఎంపీపీ లతాలక్ష్మారెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు మారేపల్లి మోహన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మారపల్లి నందం, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు అరికిల్ల ప్రసాద్, కరుణ్ బాబు, అట్ల రమేశ్, అట్ల తిరుపతి పాల్గొన్నారు.

లిఫ్ట్-3 పనులకు శంకుస్థాపన

ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, జనవరి 24 : మండలంలోని ధర్మాపురం గ్రామంలో గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడే రూ.105కోట్లతో లిఫ్ట్-3 పనులు మంజూరు చేయించానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మాపురం, మల్లక్‌పల్లె, వంగలపల్లె, వెంటాపురం గ్రామాల్లో పనులు పూర్తి చేసి చెరువులు, కుంటలను నింపి పంటలకు నీళ్లు అందివ్వనున్నట్లు తెలిపారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, డీఈ శ్రీకాంత్, ఈఈ ప్రవీణ్, జేఈలు కుమలాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి..

హనుమకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని రాంపూర్, ఉనికిచర్ల గ్రామాల్లో పెండింగ్ సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కడియం అధికారులను ఆదేశించారు. హనుమకొండ కనుకదుర్గా కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో బల్దియా అధికారులు, రాంపూర్, ఉనికిచర్ల గ్రామాల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమీక్షించారు. బల్దియా ఈఈ సంతోష్, కాజీపేట జోన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, జనవరి 24 : హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి జరిగే 41వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీల ఎంపికలు శుక్రవారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో నిర్వహించారు. సుమారు 50 మంది బాలికలు 50 మంది బాలురు హాజరయ్యారు. టెన్నికాయిట్ వరంగల్ జిల్లా కార్యదర్శి గోకారపు శ్యాంకుమార్, హనుమకొండ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి జహూర్ పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో వర్క్‌షాప్

నయీంనగర్, జనవరి 24 : హనుమకొండలోని వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా 'ఆన్ మైండ్ బాడీ మెడిసిన్ ప్రాక్టీస్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. చెన్నై నుంచి డాక్టర్ భరత్‌రాజ్‌జైన్, శుభవర్షిని, పేరరసు కన్నన్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ వాహినీ, నిషాత్ ఫాతిమా, హరిచంద్రప్రసాద్, శ్రీనివాస్, శరవణభవన, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌కు హాజరైన చెన్నై వాసులు

రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

హసన్‌పర్తిలో ర్యాలీ తీస్తున్న నాయకులు

హసన్‌పర్తి, జనవరి 24 : రాజ్యాంగాన్ని సామాన్య ప్రజలకు తెలిసేలా చైతన్యం చేయాలని కార్పొరేటర్ శివకుమార్ అన్నారు. సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ తీశారు.

రాజకీయ చైతన్యంతోనే రాజ్యాధికారం సాధ్యం

బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు

మాట్లాడుతున్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు

హనుమకొండ, జనవరి 24 : రాజకీయ చైతన్యంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని, ఇందుకు ప్రత్యేక రాజకీయ పార్టీ అవసరం అని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ టీ చిరంజీవులు అన్నారు. భారత రత్న, జననాయక్ కర్పూరి ఠాకూర్ 102వ జయంతి సందర్భంగా శుక్రవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఫోరం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూరపాటి రమేశ్ అధ్యక్షతన జరిగిన 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం వాటా కోసం ఉద్యమిస్తున్న బీసీలు దోపిడీ, ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలను వీడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు దాటినా బీసీ జనగణన కోసం పోరాటాలు చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ అయిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో మెజార్టీ సీట్లు బీసీలు గెలవడమే లక్ష్యంగా ఫోరం కృషి చేస్తుందన్నారు. పల్లెల్లో గెలిస్తేనే ఢిల్లీని గెలవొచ్చన్నారు. కాగా, సదస్సు ప్రారంభానికి ముందు వివిధ బీసీ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సదస్సుకు పిలిచి వేదికపైకి ఆహ్వానించకుండా చిన్నచూపు చూడటం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, దినేశ్, విజయ్‌బాబు, దిగంబర్‌రావు, వెంకటస్వామి, తిరునహరి శేషు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అన్ని రంగాల్లో బాలికలదే ప్రథమస్థానం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్, జనవరి 24 : అన్ని రంగాల్లో బాలికలదే ప్రథమస్థానం అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది(2015–25) ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని, విభిన్న రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు అవార్డులు అందజేశారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వాసంతి, డీఎంహెచ్‌వో అప్పయ్య, కార్పొరేటర్ స్వరూప, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాసరావు, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుధాకర్, రాజేంద్రప్రసాద్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే అన్నారు. 57,58వ డివిజన్లలో ప్రజాపాలన సహాయ కేంద్రాలను పర్యవేక్షించారు. గోకుల్‌నగర జంక్షన్ వద్ద రూ.5.50కోట్లతో చేపట్టిన సైడ్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం..

హనుమకొండ : రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే నాయిని అన్నారు. తలసీమియా పిల్లల కోసం రెడ్‌క్రాస్‌లో జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యుడు పుల్లూరి వేణుగోపాల్, కెమిస్ట్స్– డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మధుకర్‌రావు, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు దోహదం

హనుమకొండ, జనవరి 24 : మహిళలు ఆర్థిక వృద్ధిని సాధించడానికి స్వయం సహాయక సంఘాలు ఎంతగానో దోహదపడతాయని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సహాయ అన్నారు. శుక్రవారం సుబేదారిలోని అసంత భవన్‌లో వనం మహిళా సంఘం 17వ వార్షిక మహాసభ సంఘం అధ్యక్షురాలు లూర్దు మేరీ అధ్యక్షతన జరిగింది. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మధు, సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిస్టర్ నిర్మల, కో ఆర్డినేటర్లు రవికుమార్, అజయ్‌కుమార్, ఎఫ్ఎంఎం సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి : ఎమ్మెల్యే నాగరాజు

నయీంనగర్, జనవరి 24 : అధికారులు సమన్వయంతో పని చేసి అర్హులను సంక్షేమ పథకాలకు ఎంపిక చేయాలని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. మడికొండలో జరిగిన వార్డు సభలో ఆయన మాట్లాడుతూ.. చెత్త డంపింగ్ యార్డును త్వరలోనే మారుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సరోజన, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, శంకర్, కుర్ల మోహన్, లక్ష్మి, రఘుచందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట, జనవరి 24 : అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శాయంపేటలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాయంపేటలో రూ.1.30 కోట్లతో నాగసముద్రానికి రోడ్డు, పత్తిపాక నుంచి కటాక్షపూర్‌కు రూ.2కోట్లు, సింగారంకు రూ.కోటి, వసంతాపూర్ నుంచి గంగిరేణిగూడేనికి రూ.2.50కోట్లు మం జూరు చేయించినట్లు తెలిపారు. పరకాల ఆర్డీవో నారాయణ, రాష్ట్ర వేజ్ బోర్డు సభ్యుడు బాసాని చంద్రప్రకాశ్, ఎంపీడీవో ఫణిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో గంగాజమున, ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి బుజ్జన్న పాల్గొన్నారు.


మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

ఐనవోలు, జనవరి 24 : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కుమార్ తండ్రి ముంజ కనుకయ్య ఇటీవల మృతి చెందగా, శుక్రవారం అతడి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన రాజారపు మల్లేశం మృతి చెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కొండపర్తిలో బీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి గద్దల ప్రభాకర్ తండ్రి ఎల్లయ్య మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి గోపాల్‌రావు, జడ్పీ మాజీ కో ఆప్షన్ ఉస్మాన్ అలీ, మాజీ వైస్ ఎంపీపీ మోహన్, నాయకులు సురేశ్, అశోక్, రఘువంశీ, చందు, రాజు, దేవదాసు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
jobs Apply Now!
★MEDICAL SHOP STAFF (Experienced.), System Operators (Exp.), Hospital Administrators (Exp.), LAB-Technicians (Exp.), OT-Technicians (Exp.) Cont: Guardian Hospital, Wgl. 12 to 2 PM.
NTW-467

★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

CHANGE OF NAME
I, MOSALI SURESH REDDY (New Name), R/o H.No. 1-7-1288, Advocates Colony, Road No.4, Hanamkonda Mdl, Hanumakonda District-506 001, T.G State, India, Have Changed my name from MOSALI SURESH (OLD NAME), To MOSALI SURESH REDDY (New Name) for all purposes.

PLOTS FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565